కోర్టు మానిటరింగ్ సెల్‌తో సత్ఫలితాలు

- 18 కేసుల్లో 19 మందికి శిక్షలు విధించిన న్యాయమూర్తులు
- బాధితులకు న్యాయం చేసేలా పోలీస్ అధికారుల కృషి



ఏలూరు కోటదిబ్బలోని మహిళా పోలీస్ స్టేషన్ (ఫైల్)

ఏలూరు టౌన్: మహిళలు, బాలికలు, యువతులపై హత్యలు, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, దాడులు, దౌర్జన్యాలు పెచ్చుమీరుతోన్న దశలో బాధితులకు న్యాయం జరిగేలా.. నిందితులకు కఠిన శిక్ష పడేలా ఏలూరు జిల్లా పోలీస్ శాఖ తనదైన ముద్ర వేసుకుంటోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దిశ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసి మహిళలపై నేరాలకు పాల్పడే నిందితులకు వేగంగా శిక్షలు అమలు చేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ప్రస్తుతం ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ సెల్‌ను తొమ్మిది నెలల క్రితం ఏర్పాటు చేశారు. కోర్టు మానటరింగ్ సెల్ నేడు సత్ఫలితాలు ఇస్తోంది. ఏడాది కాలంలోనే బాలికలు, మహిళలపై నేరాలకు పాల్పడిన నిందితులకు కోర్టుల్లో కఠిన శిక్షలు పడేలా కృషి చేస్తోంది.

కోర్టు మానిటరింగ్ సెల్

ఎస్పీ శివకిషోర్ పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జిగా మహిళా స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు పనిచేస్తున్నారు. ఏలూరు జిల్లా కోర్టుల్లో 15 మంది హెడ్ కానిస్టేబుళ్లు ప్రతి రోజూ కేసులకు సంబంధించి జిల్లా న్యాయస్థానాల్లో విధులు నిర్వర్తిస్తూ ఉంటారు. మహిళలు, బాలికలపై తీవ్రమైన కేసుల్లో ప్రత్యేకంగా దర్యాప్తు చేయటం, సాక్ష్యాధారాల సేకరణ, కోర్టుకు చార్జిషీట్ దాఖలు చేయటం, సాక్షులను కోర్టు ఎదుట హాజరుపరచటం వంటి పనులను వేగవంతంగా చేస్తూ నిందితులకు కఠిన శిక్షలు విధించేందుకు న్యాయస్థానాలకు అవసరమైన ఆధారాలను సమర్పిస్తున్నారు. ఇదే నేపథ్యంలో ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకు మహిళలు, బాలికలపై నేరాలకు సంబంధించిన 21 కేసుల్లో 40 మందికి కఠిన శిక్షలు విధించేలా కృషి చేశారు.


సమీక్షా సమావేశంలో కోర్టు మానిటరింగ్ సెల్ అధికారులు, సిబ్బంది (ఫైల్)


సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎస్పీ కేపీ శివకిషోర్

నేరగాళ్లకు కఠిన శిక్షలు

ఏలూరు జిల్లాకు సంబంధించి మహిళా నేరాల్లో నిందితులకు న్యాయస్థానాలు కఠినమైన శిక్షలు విధించారు. కోర్టు మానిటరింగ్ సెల్ అధికారులు కీలకమైన కేసుల్లో బాధితులకు న్యాయం అందించటం, నిందితులను దోషులుగా నిర్ధారించటం, కఠిన శిక్షలు విధించేలా చర్యలు చేపడుతున్నారు. ఇటీవల కాలంలో 7 కేసుల్లో 11 మంది నిందితులకు జీవిత ఖైదులు న్యాయస్థానాలు విధించాయి. రెండు కేసుల్లో ఇద్దరు నిందితులకు 10 సంవత్సరాలు జైలు శిక్ష, ఒక కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్షలు ఇలా సుమారుగా 21 కేసుల్లో 40 మంది వరకు నిందితులకు కఠిన శిక్షలు విధించటంలో కోర్టు మానిటరింగ్ సెల్ కీలకంగా వ్యవహరించింది. జిల్లా న్యాయస్థానాల్లో తొమ్మిది నెలల్లోనే నిందితులను దోషులుగా నిరూపించి, కఠిన శిక్షలు పడేలా ఎస్పీ శివ కిషోర్ కృషి చేశారు.

నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు



ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేశారు. కేవలం తొమ్మిది నెలల్లోనే ఆయన ప్రత్యేక శ్రద్ధ, పర్యవేక్షణలో మహిళలపై నేరాలకు పాల్పడిన నిందితులను కోర్టుల్లో దోషులుగా నిలబెట్టి కఠిన శిక్షలు విధించేలా చర్యలు చేపట్టాం. బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడినా, హత్యలు, వరకట్న వేధింపులు, దాడులకు పాల్పడిన కేసుల్లో తీవ్రమైన వాటిపై దృష్టి సారించి కఠిన శిక్షలు పడేలా కృషి చేస్తున్నాం. నేరాలకు పాల్పడే వారికి భయం వచ్చేలా కఠిన శిక్షలు విధించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎం సుబ్బారావు, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి

క్లుప్తంగా

రోడ్డు సమస్యపై వినతి


సోషల్ వెల్ఫేర్ జేడీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సంక్షేమ హాస్టల్ విద్యార్థులు నిత్యం నడిచే స్థానిక అమీనా పేట బాలయోగి సైన్స్ పార్క్ రోడ్డును పునర్నిర్మించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాకి నాని ఎస్ మహర్షి డిమాండ్ చేశారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ విశ్వమోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సైన్స్ పార్క్ రోడ్డులో లోపల ఎస్సీ, బీసీ ప్రిమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ బాలికల హాస్టళ్లు ఉన్నాయని, సుమారు 2000 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఈ రోడ్డు గోతుల్లో వర్షం, డ్రెయినేజీ నీరు చేరి విద్యార్థులు నడవడానికి ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. నిత్యం సోషల్ వెల్ఫేర్, విద్యుత్ అధికారులు కూడా ఈ మార్గంపై వెళ్తున్నప్పటికీ పరిష్కారం చూపడం లేదని తెలిపారు.

వార్డ్ మెంబర్‌కు వైఎస్సార్ సీపీ నేతల ఆర్థిక సాయం


సాయం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దెందులూరు: గోపన్నపాలెం పంచాయతీ మూడో వార్డు మెంబర్ యంత్రపాటి నాగమ్మకు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, దాతలు రూ.43 వేల ఆర్థిక సాయం అందించారు. మంగళవారం గోపన్నపాలెంలోని బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించి నగదును తోట పద్మారావు అందజేశారు. ఈ సందర్భంగా గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగ ఇన్‌చార్జి తోట పద్మారావు మాట్లాడుతూ బాధితురాలికి ఆర్థిక సాయమందించడం స్ఫూర్తిదాయకమన్నారు. ప్రచార విభాగపు ఇన్‌చార్జి తోట పద్మారావు సహృదయంతో వైఎస్సార్‌సీపీ గ్రూపులో బాధితురాలు అనారోగ్యం తెలియజేసి దాతలు ఇచ్చిన నగదును బాధితు రాలి కుటుంబానికి అందజేయడం ఈ 15 రోజుల్లో పద్మారావు పడిన శ్రమ చేసిన కృషిని మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, నాయకులు అభినందించారు.

ఏజెన్సీలో అక్రమ కట్టడాలపై ఫిర్యాదు

బుట్టాయగూడెం: షెడ్యూల్ ప్రాంతంలో నిర్మిస్తోన్న అక్రమ కట్టడాలను తొలగించాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు మంగళవారం ఐటీడీఏ పీఓ రాములు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీలో అక్రమ కట్టడాలు తొలగించాలని అనేక సార్లు అధికారులకు వినతిపత్రం అందించామని గుర్తుచేశారు. ఆ సంఘ నాయకులు కుంజా కృష్ణంరాజు, రవ్వా బసవరాజు, పొడియం కవలయ్య, కొండరెడ్ల సంఘం నాయకులు పట్ల రమేష్ రెడ్డి, మల్లీశ్వరరావు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

జంగారెడ్డిగూడెం: స్థానిక పురపాలక సంఘం పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్మికులకు ప్రతి నెలా జీతాలు ఆలస్యం అవుతూనే ఉన్నాయని, ప్రస్తుతం రెండు నెలలు గడుస్తున్నా ఇంకా జీతాలు చెల్లించేలని తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభించి 10 రోజులు అయిందని, పిల్లలు స్కూల్, కాలేజీలలో చేర్పించేందుకు చేతిలో పైసలు లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నామని వివరించారు. కమిషనర్ వెంటనే స్పందించి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు, ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు కూన పాముల విఘ్నేష్‌లు కోరారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం పురపాలక సంఘం ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షులు కంతేటి వెంకటరావు, ఇంజినీరింగ్ విభాగం కార్యదర్శి నిమ్మల సుబ్బారావు, అయినాల ముత్యాలరావు, దోసూరి నాగరాజు, పారిశుద్ధ్య విభాగం కార్యదర్శి బొక్కా శ్రీనివాస్, కొత్తూరి నాగేశ్వరావు, పితాని సురేష్, కొత్తూరి శ్రీను, ఇంగుర్తి నాగరాజు, కొత్తూరి ఏమిలేశ్వరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక 2వ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఏలూరు ఏరియా సమితి నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ మాట్లాడుతూ 2వ డివిజన్, బృందావన్ గార్డెన్స్ పరిసర ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరంతా ఇళ్ల మధ్యనే నిలిచిపోయి, దోమలు పెరిగిపోయి ప్రజలు అనారోగ్యాలపాలవుతున్నారని తెలిపారు. వెంకటాపురం పంచాయతీ నుంచి ఏలూరు నగరంలోకి విలీనమైన తరువాత కూడా ఈ ప్రాంతంలో నివాస ప్రదేశాల నుంచి ప్రధాన రహదారికి రావడానికి సరైన రోడ్డు లేదన్నారు. వీధి దీపాల లేక ప్రజలు పాములు, విష కీటకాల బారిన పడి ప్రమాదాలకు గురవుతున్నారని వివరించారు. కిలో మీటర్‌కు పైగా నడచి వెళ్లి మున్సిపల్ మంచి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని తెలిపారు.



ధర్నా చేస్తున్న నాయకులు

ఏరియా సహాయ కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మీ ఇందిర మాట్లాడుతూ రెండో డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్పొరేషన్ మేనేజర్‌కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏలూరు ఏరియా సమితి సభ్యులు మావూరి విజయ, శాయన అభిలాష్ కుమార్, గొర్లి స్వాతి, కొండేటి రాంబాబు, దేశంశెట్టి అమ్మాజీ, నాయకులు లక్కోజు జగదీశ్వరి, వెదురుపర్తి శారద, లక్కోజు లక్ష్మి, దొడ్డి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

గ్రాట్యుటీలు చెల్లించకపోవడం దారుణం


మాట్లాడుతున్న అబ్బదాసరి శ్రీనివాసరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పదవీ విరమణ పొంది ఏడాది కాలం పూర్తయినా ఆ ఉపాధ్యాయులకు గ్రాట్యుటీలు చెల్లించకపోవడం దారుణమని ఏపీటీఎఫ్ నగర అధ్యక్షుడు కురుమ ఆనందకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం ఏపీటీఎఫ్ ఏలూరు నగర శాఖ సమావేశం స్థానిక గాంధీ నగర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏలూరు జిల్లా శాఖ అధ్యక్షుడు తాళ్లూరి రామారావు మాట్లాడుతూ తాజాగా బదిలీ అయ్యి క్లస్టర్ల వేకెన్సీలోకి వెళ్లిన మిగులు ఉపాధ్యాయులకు సకాలంలో జూన్ నెల వేతనాలు ఇవ్వాలని, వారిని సీఎఫ్‌ఎంఎస్‌కు అనుసంధానం చేసి పొజిషన్ ఐడీలను కేటాయించాలని కోరారు. ఉపాధ్యక్షుడు ఎల్‌వీఏ రత్న కుమార్ మాట్లాడుతూ మిగులు ఉపాధ్యాయులను కార్పొరేషన్ పాఠశాలల్లోనే త్వరగా సర్దుబాటు చేయాలన్నారు. ఉపాధ్యక్షుడు ఎంవీ సుబ్బారావు మాట్లాడుతూ 3 పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, 2023 జూలై నుంచి అమలు కావాల్సిన 12వ పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని కోరారు. ఉపాధ్యక్షుడు ఎండబ్ల్యూ బెనర్జీ, కార్యదర్శి ఎం వెంకటేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్ చింతా వెంకటరత్నం, నగర ప్రధాన కార్యదర్శి అబ్బదాసరి శ్రీనివాసరావు మాట్లాడారు. సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు కె.పాట్టియ్య, కార్యదర్శి తొమ్మండ్రు ప్రకాష్, జిల్లా కౌన్సిలర్లు వీవీ సుబ్రహ్మణ్యం, కొడమంచిలి కుమార్, జంపిన శాంతి కుమార్, పి.రోజా, ఎస్ఎస్ ప్రతాప్, కె.సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


ఉంగుటూరు: ఎంపీడీఓ రాజ్‌మనోజకు వినతి పత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు


గణపవరం: ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఉంగుటూరు: సచివాలయ ఉద్యోగులు వారి సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఎంపీడీవో కార్యాలయాల ముందు నిరసన వ్యక్తం చేసి, ఎంపీడీవోలకు వినతి పత్రాలను సమర్పించారు. సచివాయ ఉద్యోగులకు వేరే మండలానికి గాని ఇదే మండలంలో వేరే గ్రామాలకు బదిలీల అవకాశం కల్పించాలని ఉంగుటూరు మండలం సచివాలయ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు ఎంపీడీవో రాజ్‌మనోజుకు విజ్ఞాపన పత్రం అందజేశారు. మున్సిపాలిటీల్లో ఒక వార్డులో పని చేసే ఉద్యోగులకు పక్క వార్డులో బదిలీకి అవకాశం కల్పించారని అలాగే మాకు కూడా కల్పించాలని వారు కోరారు. సచివాలయాలు గ్రేడు–5, సర్వేయర్లు, డిజిటల్ సహాయకులు, వ్యవసాయశాఖ సహాయకులు తదితర ఉద్యోగులుపాల్గొని వారి డిమాండ్‌ను వినిపించారు.

పదోన్నతుల సంగతి తేల్చండి

గణపవరం: ముందుగా తమ పదోన్నతుల సంగతి తేల్చాలని, తరువాతే బదిలీలను చేయాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు నినదించారు. ఈ మేరకు గణపవరం మండల సచివాలయ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి మంగళవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీవో బేబీశ్రీలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 5ను సవరించాలని, సొంత మండలంలో పని చేసేలా సచివాలయ ఉద్యోగులకు అవకాశం కల్పించాలని రేషనలైజేషన్‌లో మిగులు సిబ్బంది పరిస్థితి ఏమిటో చెప్పాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని సచివాలయ ఉద్యోగులు నినాదాలు చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సచివాలయ ఉద్యోగులు ఏపీజీఈఏ ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు.

ఎన్‌జీవోస్ నాయకులకు సన్మానం

ఏలూరు(మెట్రో) : ఏలూరులో ఏపీఎన్‌జీవోస్ నాయకులను మంగళవారం ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వార్డు సెక్రటరీలు సన్మానించారు. సచివాయాల్లో పనిచేస్తున్న వార్డు సెక్రటరీల బదిలీ మార్గదర్శకాల్లో మార్పులు చేసేందుకు ఏపీ ఎన్‌జీవోస్ నాయకులు కృషి చేశారని వార్డు సెక్రటరీల బృందం తెలిపింది. జీఓకు కృషిచేసిన ఏపీఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆలపర్తి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డీవీ రమణలను వార్డు సెక్రటరీల బృందం సత్కరించింది. ఈ సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ఏర్పడనప్పటి నుంచీ రాష్ట్రంలో ఉన్న సుమారు ఒక లక్షా 25 వేల మంది తరపున పోరాడి ప్రొబేషన్ డిక్లరేషన్ చేయించామని, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ వీరి పక్షాన నిలబడిందని వివరించారు.


ఏపీఎన్‌జీవోస్ నాయకులను సన్మానిస్తున్న వార్డు సెక్రటరీలు

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. రాగి వైరు చోరీ

కొయ్యలగూడెం: ఆరిపాటి (కనకాద్రిపురం) సమీపంలో కౌలు రైతు సుంకర రాంబాబుకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి అందులోని కాపర్ (రాగి) వైరును దొంగిలించారు. దుండగులు పంపు సెట్టును కూడా ధ్వంసం చేశారని రాంబాబు మంగళవారం పేర్కొన్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి నిరవధిక దీక్ష

జంగారెడ్డిగూడెం: స్థానిక ఏరియా హాస్పిటల్ శానిటరీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మెడికల్ కాంటాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏరియా హాస్పిటల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు మాట్లాడుతూ కార్మికులు గత పది రోజులుగా హాస్పిటల్ ఎదుట ధర్నా చేస్తున్నా అధికారులు కాంట్రాక్టర్ కనీసం స్పందించడంలేదని, దీంతో బుధవారం నుంచి విధులను బహిష్కరించి నిరవధిక నిరాహార దీక్ష చేయనున్నట్టు చెప్పారు. శానిటరీ వర్కర్స్‌కి మూడు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏలూరు జిల్లా అధ్యక్షుడు కూనపాముల విగ్నేష్, నాయకులు వేముల రాజు, సంజీవ్, మేరీ, చంద్రకళ, దయామని, జె.దుర్గారావు, పి.శ్రీను పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	35
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	20
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	31
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	21
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	31
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	33
ఏలూరు – తిరుపతి	16.00	4830	33

నమ్మించి.. నట్టేట ముంచి

- ఎన్నికల ముందు వలంటీర్లకు కూటమి వరాలు
- అధికారంలోకి వచ్చాక ఆ వ్యవస్థకే మంగళం
- రోడ్డున పడిన వలంటీర్ల కుటుంబాలు


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లను సన్మానిస్తున్న అప్పటి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి (ఫైల్)


వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లు (ఫైల్)

దెందులూరు: ఎన్నికల ముందు నమ్మబలికి కూటమి ప్రభుత్వం బలి తీసుకుందని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్ వ్యవస్థను కొనసాగించకపోవడంతో ప్రజలకు కీలక సేవలు దూరమయ్యాయి. పైరవీలకు తావు లేకుండా ఐదేళ్లపాటు లబ్ధిదారుల ఇళ్ల వద్దనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి ప్రశంసలందుకున్న వలంటీర్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం అటకెక్కించింది. గత ఏడాది ఎన్నికల ముందు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, వారి గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచుతామంటూ ఊరూవాడా హోరెత్తించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక ఆ వ్యవస్థకు మంగళం పాడారు. ప్రభుత్వ చర్యతో వలంటీర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. నమ్మి మోసపోయామని వలంటీర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఇంటి ముంగిటకే సేవలందించాలన్న గొప్ప సంకల్పంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చింది. ప్రతి వార్డు, గ్రామ సచివాలయ పరిధిలో 50 కుటుంబాలకు ఓ వలంటీర్‌ను నియమించి సంక్షేమ పాలనను ప్రజలకు చేరువ చేసింది. దేశంలోనే తొలిసారి ఇలాంటి వ్యవస్థను ప్రవేశపెట్టి మన్ననలు అందుకుంది. అలాంటి వ్యవస్థను రాజకీయ అక్కసుతో కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కేసింది.

నాడు ప్రోత్సాహకాలు

కేవలం రూ.5 వేల గౌరవ వేతనంలో అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లలో సేవా దృక్పథం పెంపొందించేందుకు వారికి గత ప్రభుత్వం నగదు పురస్కారాలను ప్రకటించింది. సేవా వజ్ర కింద రూ.45 వేలు, సేవా రత్న కింద రూ.30 వేలు, సేవా మిత్ర కింద రూ.15 వేలు ఏటా వలంటీర్లకు ప్రోత్సాహకాలను అందజేసింది.

పింఛన్ల పంపిణీలో వలంటీర్ సేవలు కీలకం

2014–2019 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో రచ్చబండలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు గంటల కొద్దీ పడిగాపులు కాస్తూ ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. వీటికి పరిష్కారం చూపాలని 2019లో వైఎస్సార్‌సీపీ అధికాంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థకు రూపకల్పన చేసి, వలంటీర్ వ్యవస్థను రూపొందించి, తెల్లవారక ముందే పింఛన్‌దారుల ఇళ్ల వద్దకు పంపించి, పింఛన్ మొత్తం ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వృద్ధులకు నేరుగా వారి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్‌ను అందజేశారు. తుఫాన్లు, వరదల్లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ వలంటీర్లు సేవలందించి, ప్రజల చేత శభాష్ అనిపించుకున్నారు.

మూల్యం చెల్లించుకోక తప్పదు



వలంటీర్లతో పాటు అనేక వేల మంది ఉద్యోగులను కూటమి ప్రభుత్వం తొలగించింది. దీంతో బాధితులు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యుల ఉసురు కూటమి ప్రభుత్వానికి శాపంగా మారనుంది. రాబోయే ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోక తప్పదు.

– తొత్తడి వేదకుమారి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి

వలంటీర్ల సేవలు ఆదర్శనీయం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియమించిన వలంటీర్లు విశిష్ట సేవలు అందించారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన నియామకం గురించి, వారు అందించిన సేవల గురించి దేశమంతటా విస్తృతంగా చర్చించుకున్నారు.

– ఎం.దుర్గా కుమారి రాజు, గ్రామ సర్పంచ్ మేధినరావుపాలెం

జీవనాధారం కోల్పోయాం



ప్రజల సమస్యలు ప్రభుత్వానికి తెలియజేసి పరిష్కారానికి కృషిచేశాం. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా సేవలందించాం. కూటమి ప్రభు త్వం వలంటీర్లు అందరినీ చిన్న చూపు చూసింది. వలంటీర్ల సేవలు నిలిపివేయడంతో మాపై ఆధారపడిన కుటుంబ సభ్యులతో జీవనాధారం లేకుండా రోడ్డును పడ్డాం.

– పెద్దిరాజు, వలంటీర్